క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతం



సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

ఆదోని అర్బన్ : సత్యమే ఈశ్వరుడని, సత్య వ్రతం కన్నా మించింది ఏదీ లేదని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీ అనంత మంగళ ఆంజనేయస్వామి దేవస్థానంలో తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉచిత సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం భక్తిశ్రద్ధల మధ్య ఆదివారం జరిగింది. ఆయన సత్యవ్రతాన్ని గురించి వివరించారు. ప్రతిఒక్కరు దేవుడి పట్ల నమ్మకాన్ని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అర్చకులు హనుమేష్ ఆచారి, అనంత మంగళ ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న నాయకులు

ఆదోని రూరల్: మండలంలోని బల్లేకల్ గ్రామంలో ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని గత నెల 14వ తేదీ నుంచి నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. పోటీల్లో మొత్తం 28 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం ఫైనల్లో బల్లేకల్ గ్రామ జట్టు, కామవరం జట్టు తలపడగా బల్లేకల్లు జట్టు విజయం సాధించింది. గెలుపొందిన జట్టుకు రూ.25వేల నగదు అందజేశారు. రన్నరప్ జట్టుకు రూ.15వేలు అందజేశారు. పెద్దరెడ్డి శ్రీనివాసరెడ్డి, నల్లారెడ్డి, నటరాజన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



మాట్లాడుతున్న నాగరాజుగౌడ్

ఆదోని అర్బన్ : స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, మాతా, శిశుకేంద్రంలో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి నాగరాజుగౌడ్, జైభీమ్ యూత్ సభ్యులు కుమార్, భజరంగదళ్ జిల్లా కన్వీనర్ రవిశంకర్ ప్రభుత్వాన్ని కోరారు.ఆదివారం స్థానిక రెవెన్యూ భవన్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదోని మండలంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో నెలకొన్న సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలోని ఆసుపత్రుల్లో వసతులు కల్పించాలని, పారిశుద్ధ్యం మెరుగు పరచాలని, బెడ్లు, బాత్ రూంలు అధ్వానంగా మారాయని వెంటనే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.నాయకులు తస్లీమా, లోకేష్, యల్లప్ప, నరసింహులు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ

ఆదోని రూరల్ : ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఆదివారం మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో పేద మహిళలకు ఆదోని మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్ చీరలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఏరువాక పౌర్ణమి వేడుకలను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటారని చెప్పారు. ఉషారాజ్, శేఖర్ యాదవ్, శంకరయ్య, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

పెద్దకడబూరు: ఈ నెల 11వ తేదీన ఎమ్మిగనూరులో జరిగే బీసీ గర్జనను విజయవంతం చేయాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సామేలు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రవికుమార్ కోరారు. పెద్దకడబూరు, మంత్రాలయం మండలాల్లో ఆదివారం బీసీ గర్జన కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు మోహన్, లక్ష్మన్న, దావీదు, రత్నము, అయ్యప్ప పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్త

హొళగుంద: సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాసులు వందవాగిలి గ్రామస్తులకు సూచించారు. శనివారం రాత్రి గ్రామాన్ని సందర్శించిన ఎస్ఐ గ్రామస్తులకు అనేక విషయాల పై అవగాహన కలిగించారు. సైబర్ నేరాలు, మహిళలపై దాడులు, ఇతర నేరాలకు సంబంధించి సమస్యలొస్తే 100తో పాటు పోలీసు శాఖకు సంబంధించిన నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. అదేవిధంగా గ్రామాలలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ శాంతభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలను బాగా చదివించాలని, రోడ్డు నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు నివారించాలన్నారు. బాల కార్మికులు, బాల్య వివాహాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు.

రీ సర్వేతో భూ సమస్యలకు చెక్

- మండలంలో 7 గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ పూర్తి
- రైతులకు భూ హక్కు పత్రం అందజేత

రీ సర్వే మొదటి విడతలో భాగంగా మండలంలోని ఏడు గ్రామాల్లో భూ సమస్యలకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది. పల్లెపాడు, కలువలగుండు, యండపల్లి, పెండేకల్లు, మూగలదొడ్డి, పుట్టకుంట, వందగల్లులో రీ సర్వే చేపట్టి రైతుల రికార్డుల్లో ఉన్న మేరకు కొలతలు వేసి హద్దులు నిర్దేశించి రాళ్లు పాతించి రాళ్లను జియో ట్యాగింగ్ చేసింది. అలాగే శాశ్వత భూ హక్కు పత్రం అందజేసింది. రీ సర్వేతో మిగులు, చుక్కల, ప్రభుత్వ భూముల వివరాలు తెలిసిపోయాయి.

కోసిగి: ఏళ్ల తరబడి భూ సమస్యలతో సతమతమవుతున్న రైతులకు పరిష్కారం చూపాలని ప్రభుత్వం నిర్ణయించింది. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు– భూ రక్ష పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. గ్రామాలను యూనిట్‌గా తీసుకుని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే చేయించి హద్దులు నిర్ణయించి రైతుల సమక్షంలో కొలతలు వేసి హద్దు రాళ్లు పాతుతున్నారు. దీంతో రైతులకు కేటాయించిన భూమి ఆధారంగా హద్దులు పాతి శాశ్వత పరిష్కారం చూపుతున్నారు. ముందుగా గ్రామాన్ని ఎంపిక చేసి డ్రోన్‌తో ఉచిత సర్వే చేసి రైతుల రికార్డుల ఆధారంగా రీ వెరిఫికేషన్ చేసి హద్దులు చూపించి హద్దు రాళ్లు కూడా ప్రభుత్వమే వేయిస్తుంది. జియో కోఆర్డినేట్ రైతు పాసుపుస్తకాల్లో పొందుపరిచిన విధంగానే ఆధునిక హద్దురాళ్లు పాతిస్తున్నారు. పొలాల్లో పాతిని ప్రతి రాయిని జియో టాగింగ్ చేస్తున్నారు. రైతులు గ్రౌండ్ వాల్యుయేషన్ సమయంలో వాళ్లు ఒప్పుకున్న నిర్ణయం మేరకే హద్దు రాళ్లు పాతించారు. మండలంలో 28 రెవెన్యూ గ్రామాల్లో 56,464.47ఎకరాల భూమి ఉంది. ఇందులో 17,006 మంది రైతులు ఉన్నారు. ఇప్పటి వరకు 7 గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తి చేసి, సంబంధిత రైతులకు పట్టదారు పాసుపుస్తకాలు అందజేశారు. మండలంలోని పల్లెపాడు, కలువలగుండు, యండపల్లి, పెండేకల్లు, మూగలదొడ్డి, పుట్టకుంట, వందగల్లు గ్రామ పొలాల్లో రీసర్వే ప్రక్రియ పూర్తి చేశారు. మండలంలోని 28 రెవెన్యూ గ్రామాల్లో 7 గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ పూర్తి చేయించారు. ఇప్పటి వరకు 8,353.30 ఎకరాలకు సంబంధించి సర్వే పూర్తి చేయగా 2,253 మంది రైతులకు జగనన్న శాశ్వత భూ హక్కు– భూ రక్ష పథకం కింద భూ హక్కు పత్రాలు అందజేశారు. ఇందుకు గానూ ఆయా పొలాల హద్దులకు ప్రభుత్వం ఇప్పటి వరకు 7,043 హద్దు రాళ్లు పాతించింది. దీంతో చుక్కల భూములకు, క్లెయిమ్ కానీ విస్తీర్ణ భూములకు కూడా శాశ్వత పరిష్కారం దొరికిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో మిగిలిన గ్రామాల్లో డ్రోన్ సర్వేను ప్రారంభించి సర్వే చేస్తామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.



పల్లెపాడు పొలాల్లో హద్దు రాళ్లు పాతిస్తున్న సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది

సర్వే పూర్తి చేసి గ్రామాల వివారాలు..

గ్రామం పేరు	రైతులు	ఎకరాలు
పల్లెపాడు	408	1,138.00
కలువలగుండు	214	214
యండపల్లి	113	426.85
పెండేకల్లు	367	1,423.16
మూగలదొడ్డి	158	848.24
పుట్టకుంట	57	112.40
వందగల్లు	936	3,851.81
మొత్తం	2,253	8,353.30

ఎవరూ చేయని పని జగన్ చేశారు



ఏ ప్రభుత్వం చేయని పనిని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసి చూపించాడు. పొలాలకు హద్దులు చూపించి రాళ్లు పాతించి శాశ్వత పరిష్కారం చూపించారు. ఏళ్లుగా భూ సమస్యలతో ఇబ్బందులు పడుతునే వచ్చాం. గత ప్రభుత్వాలు చొరవ చూపి పరిష్కారం చూపలేకపోయాయి. గతంలో మండల రెవెన్యూ, డివిజనల్, కలెక్టరేట్ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. ప్రస్తుతం రైతుకు భారం మోపకుండా రీ సర్వే చేసి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడం సంతోషంగా ఉంది. **– కాల్వ లక్ష్మయ్య, వందగల్లు**

రైతులకు హక్కు పత్రాలు అందజేశాం



మండంలోని 7 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేయించాం. రైతుల అభిప్రాయం మేరకు కొలతలు వేసి హద్దులు నిర్ణయించి రాళ్లు పాతించే కార్యక్రమాన్ని పకడ్బందీగా విజయవంతం చేశాం. ప్రతి రైతు పొలానికి హద్దురాళ్లు పాతించాం. సర్వే పూర్తి చేయించుకున్న రైతులందరికీ శాశ్వత భూ హక్కు పత్రాలు అందజేశాం. అనుమతులు వచ్చిన వెంటనే మిగిలిన గ్రామాల్లో డ్రోన్ ద్వారా సర్వే చేపట్టేందుకు చర్యలు తీసుకుని రీసర్వే ముమ్మరం చేస్తాం. **– రుద్రగౌడ, తహసీల్దార్**

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



అంధ విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్ : మండలంలోని దిబ్బనకల్‌కు చెందిన అంధ విద్యార్థులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.లక్ష విలువైన చెక్కును ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆదివారం అందజేశారు. అంధ విద్యార్థులు లక్ష్మి, లక్ష్మణ్ మాట్లాడుతూ పేదరికంలో ఉన్న సాయం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి రుణపడి ఉంటామని చెప్పారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

కోసిగి: మండలంలో ఇటీవల ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు పడిపోయిన విషయం తెలిసిందే. అయితే వాటి స్థానంలో విద్యుత్ సిబ్బంది కొత్త స్తంభాల ఏర్పాటును యుద్ధప్రాతిపదికన చేస్తున్నారు. కోసిగి, దుద్ది, మూగలదొడ్డి, అగసనూరు, సాత నూరు, చిర్తనకల్లు, సజ్జలగుడ్డం గ్రామాల్లో దాదాపు 53 విద్యుత్ స్తంభాలు నేలవాలినట్లు ట్రాన్స్ కో ఏఈ వీరేష్ తెలిపారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా అత్యవసరమైన ప్రాంతాల్లో ఇప్పటి వరకు కొత్తగా 35 స్తంభాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మిగిలినవి రెండు రోజుల్లో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. అలాగే కోసిగి కడపాశం వీధిలో మానికింద వీరారెడ్డి అనే వ్యక్తి ట్రాక్టర్‌తో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి విరగకొట్టాడని, ఆయనపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



విద్యార్థినికి మెమొంటో అందజేస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్ : రజకల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన రజక విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. సంఘం జిల్లా కన్వీనర్ నాగరాజు అధ్యక్షతన పేట వీరభద్రేశ్వరస్వామి దేవాలయ వార్డులో వార్డు కౌన్సిలర్ నాగరత్న సౌజన్యంతో కార్యక్రమం నిర్వహించారు. 50 మంది విద్యార్థులకు మడివాల మాచయ్య మెమోంటో నోట్‌బుక్స్, రైటింగ్ ప్యాడ్, ఇతర మెటీరియల్ అందజేశారు. గోవిందప్ప, ముంబత్తిస్వామి, సతీష్, సాయిబాబా, మొక్కన్న, హుసేని పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సామాజిక న్యాయం



టీడీపీని వీడి మంత్రి గుమ్మనూరు జయరాం సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన గూళ్యం గ్రామస్తులు

ఆలూరు: ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా, కుయుక్తులు పన్నినా రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టడం, సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనా పగ్గాలు స్వీకరించడం ఖాయమని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. స్థానిక మంత్రి నివాసంలో ఆదివారం హాలహర్వి మండలం గూళ్యం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వడ్డె శంకరప్ప, మల్లికార్జున, భీమలింగతో పాటు మరో వంద కుటుంబాల వారు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి మంత్రి జయరాం పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఇలా అనేక పార్టీలతో పొత్తు పెట్టుకుని అధికారం చేపట్టాలని ఆయా పార్టీల నాయకులు పగటికలలు కంటున్నారని, వారి ఆశలు నెరవేరవన్నారు. ప్రజా సంక్షేమానికి పాటు పడుతున్న వైఎస్సార్‌సీపీ వైపే జనం ఉన్నారని, ఎన్నికల సమయంలో ఆయా పార్టీలకు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని మంత్రి జోస్యం చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఎన్ని మేనిఫెస్టోలు విడుదల చేసినా, సొంతంగా దిశానిర్దేశం లేని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎన్ని మాయమాటలు చెప్పినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఎద్దేవా చేశారు. దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, చింతకుంట సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు బసవరాజ్, కృష్ణ పాల్గొన్నారు.

అడుగంటిన తుంగభద్ర



ప్రస్తుతం టీబీ డ్యాంలో నిల్వ ఉన్న నీరు

హొళగుంద: ఆంధ్రా, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి రిజర్వాయర్, జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలకు వర ప్రధాయిని తుంగభద్ర డ్యాంలో నీరు అడుగంటింది. ప్రస్తుతం కేవలం 5 టీయంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి 39.232 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. డ్యాంలో ప్రస్తుతం 1580.94 అడుగుల వద్ద నీటి మట్టం ఉంది. ఆదివారం ఇన్‌ఫ్లో 1,053 క్యూసెక్కులుగా నమోదైంది. దీంతో జలాశయంలో ఆశించిన స్థాయిలో నీరులేక కళ తప్పింది. కర్ణాటకతో పాటు ఆంధ్రాలోని కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలకు సాగు, తాగునీరు అందిస్తున్న టీబీ డ్యాంకు గతేడాది మే నెలలోనే భారీగా వరద నీరు చేరగా జూలైలో పూర్తిస్థాయిలో నిండి పలుసార్లు డ్యాం 33 గేట్లు ఎత్తి నదికి విడుదల చేసిన సంగతి తెలిసిందే. జలాశయం పైభాగంలోని ఆగుంబే, వరనాడు, శివమొగ్గ, తీర్థనహళ్లీ, శృంగేరి తదితర ఉత్తర కర్ణాటక ప్రాంతాల్లో ఇంకా వర్షాలు మొదలు కాకపోవడంతో డ్యాం నీరు లేక బోసిపోయింది. అయితే ఆగస్టు వరకు వర్షాలు కురిసే అవకాశాలుండడంతో రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

స్కూటర్లు ఢీ - ముగ్గురికి గాయాలు



తీవ్రంగా గాయపడిన శేఖర్

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని మంత్రాలయం రోడ్డు రిలయన్స్ పెట్రోల్ బంకు ఎదురుగా ఆదివారం సాయంత్రం రెండు స్కూటర్లు ఎదురెదురుగా ఢీకొనటంతో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. వివరాలు.. పెద్దకడబూరు మండలం హెచ్.మురవణికి చెందిన మహమ్మద్‌ఖాదర్, చెల్లెలు భాను స్కూటర్‌పై గ్రామానికి వెళ్తున్నారు గోనెగండ్ల మండలం పెద్దనెలటూరుకు చెందిన శేఖర్ స్థానిక అన్నమయ్య సర్కిల్ నుంచి రాంగ్ రూట్‌లో వచ్చి స్కూటర్‌ను ఢీకొట్టి డివైడర్‌పై పడిపోయాడు. ప్రమాదంలో ఖాదర్, భానుకు గాయాలు కాగా, శేఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకొని అక్కడికి చేరుకున్న ట్రాఫిక్ ఎస్ఐ రమేష్‌బాబు గాయపడ్డ శేఖర్‌ను చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఖాదర్, భాను ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శేఖర్ చెవి నుంచి రక్తం రావడంతో పాటు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కేసు నమోదు చేసుకున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

హాలహర్వి: మండలంలోని బాపురం గ్రామానికి చెందిన వ్యక్తి మోటారు బైక్ నుంచి అదుపుతప్పి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం హాలహర్వి గ్రామ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బాపురం గ్రామానికి చెందిన ఉమేష్ సొంత పనిపై మోటారు బైక్‌పై హాలహర్వి గ్రామానికి బయలుదేరారు. మధ్యలో బైక్ అదుపుతప్పి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. అక్కడున్న వారు క్షతగాత్రుడిని వైద్యం కోసం ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఏరువాక సంబరాలు



ప్రత్యేక అలంకరణలో మారెమ్మదేవి,



మంత్రాలయంలో పారువేట బరిలో నిలిచిన వృషభాలు

మంత్రాలయం: స్థానిక పాతవూరు సంతమార్కెట్‌లో ఏరువాక సంబరాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య, సీఐ శ్రీనివాసులు, ఏఎస్ఐ ఆనంద్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వృషభాల పారువేట ప్రాంతంలో సర్పంచ్ తెల్లబండ్లభీమయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేశారు. మూడుసార్లు వృషభాల పారువేట నిర్వహించారు. పారువేటలో కురువ నర్సిరెడ్డి వృషభం ప్రథమ నిలిచింది. వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, వైస్ఎంపీపీ పులికుక్కరాఘవేంద్ర, ఉపసర్పంచ్ హోటల్ పరమేష్, ఎంపీటీసీ సభ్యులు వెంకటేష్‌శెట్టి పాల్గొన్నారు. అలాగే మండలంలోని రాంపురం గ్రామంలో కోసిగి వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మురళీమోహన్‌రెడ్డి, సుంకేశ్వరి గ్రామంలో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కిరణ్, సర్పంచ్ ముక్కరన్న ఆధ్వర్యంలో ఏరువాక సంబరాలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వృషభాలను ఊరేగించారు.

కోసిగి: కొంగొత్త ఆశలతో ఏరువాక పౌర్ణమి వేడుకలు గ్రామాల్లో రైతులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం జేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని మండల కేంద్రంలో వేకువ జామున నుంచి రైతులు గ్రామ దేవతలు మారెమ్మ, సుంకులమ్మకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి పుష్కలంగా పంటలు పండాలని గ్రామ దేవతలను వేడుకున్నారు. సాయంకాలం ఎద్దులకు స్నానాలు చేయించి కొమ్ములకు రంగులు వేసి వివిధ రకాలుగా ముస్తాబు చేసి పూజలు చేశారు. అనంతరం ఎద్దులను పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఊరువాకిలి, చాడమ్మ వీధి కింది మారెమ్మ దేవి ఆలయం వద్ద ఎద్దుల పారువేల పోటీలు నిర్వహించారు. అలాగే మండలంలోని వందగల్లు , జంపాపురం, ఐరన్‌గల్లు, చింతకుంట, పల్లెపాడు తదితర గ్రామాల్లో వేడుకలు ప్రశాంతంగా జరుపుకున్నారు.

విజేతలకు బహుమతులు

కోసిగి: మండలంలోని ఐరన్‌గల్లు గ్రామంలో ఏరువాక పర్వదినం సందర్భంగా యువతకు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం 5కి.మీ. పరుగు పందెం పోటీలు నిర్వహించారు. ఇందులో మేకల వీరేష్ అనే యువకుడు ప్రథమ స్థానం నిలిచాడు. విజేతకు సర్పంచ్ రామాంజనేయులు రూ.వెయ్యి నగదు, షీల్డు, మెడల్ అందజేశారు. తరువాతి స్థానాల్లో దేవర నాగుడు, వీరాంజినేయులు, నరసింహులు నిలిచారు.

పెద్దకడబూరు : ఏరువాక పౌర్ణమి సందర్భంగా మండలంలోని గ్రామాల్లో ఆదివారం రైతులు, ప్రజలు ఘనంగా వేడుకలను జరుపుకున్నారు. రైతులు ఎద్దులను ముస్తాబు చేసి పూజలు చేసి పొలాల్లో పుడమి తల్లి పూజల అనంతరం సేద్యపు పనులు ప్రారంభించారు. సాయంత్రం గ్రామాల్లో పారేవట నిర్వహించారు.

కౌతాళం: మండలంలో ఏరువాక పౌర్ణమి వేడుకలను ఆదివారం రైతులు ఘనంగా నిర్వహించారు. హాల్వి, ఓబుళాపురం, కామవరం, నదిచాగి, డమ్ములదిన్నె, బాపురం గ్రామాల్లో రైతులు తమ వృషభాలకు స్నానాలు చేయించి కొమ్ములకు వివిధ రంగులు వేసి సుందరంగా అలంకరించి సాయంత్రం పారువేట పోటీలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో యువకులకు పరుగు పందెం, ఇసుక బస్తాలు, గుండు ఎత్తు పందేలు ఏర్పాటు చేశారు.

ఆదోని రూరల్ : నియోజకవర్గంలో ఏరువాక పౌర్ణమి వేడుకలను ఆదివారం రైతులు ఘనంగా జరుపుకున్నారు. రైతుల నేస్తాలైన ఎద్దులకు ఉదయం స్నానం చేయించి, రంగులతో అలంకరించి పూజలు చేశారు. ఆలయాలకు వెళ్లి పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని దేవుళ్లను కోరుకున్నారు. మండలంలోని కపటి, పెసలబండ, మాంత్రికి, మదిరె, దిబ్బనకల్లు, విరుపాపురం, గోనబావి, ఢణాపురంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దతుంబళం గ్రామంలో సాయంత్రం ఎద్దుల పారువేట చేపట్టారు.గెలుపొందిన వృషభాలను ఊరేగించారు.



ఓబులాపురంలో పారువేటలో పాల్గొన్న వృషభాలు

జయప్రదం చేయండి

ఆదోని సెంట్రల్ : ఈనెల 24వ తేదీన ఎమ్మిగనూరులో జరగనున్న ఆంధ్రప్రదేశ్ చర్మకారుల వృత్తిదారుల సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కేవీపీఎస్ సీనియర్ నాయకులు పి.ఎస్. గోపాల్, జిల్లా ఉపాధ్యక్షులు బి.తిక్కప్ప, పట్టణ కార్యదర్శి నాగరాజు కోరారు. ఆదివారం పట్టణ పరిధిలోని కల్లుబావిలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు.కృష్ణమూర్తి, మల్లికార్జున, వీరేష్, వెంకటేష్, సుందరయ్య పాల్గొన్నారు.

పంచభూత లింగ క్షేత్ర యాత్రకు 9న ప్రత్యేక బస్సు

కర్నూలు(రాజ్‌విహార్): పంచభూత లింగ క్షేత్రాల దర్శనం కోసం ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు నడపనున్నట్లు కర్నూలు–1 డిపో అసిస్టెంట్ మేనేజరు సుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాత్రలో కాణిపాకం (వినాయకుడు)తో పాటు పంచభూత లింగ క్షేత్రాలు అరుణాచలం (అగ్ని లింగం), జంబుకేశ్వరం (జల లింగం), చిదంబరం (ఆకాశ లింగం), కంచి (పృథ్వీ లింగం), శ్రీకాళహస్తి (వాయు లింగం) క్షేత్రాల దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. ఈ యాత్రకు ఈ నెల 9వతేదీన రాత్రి 8గంటలకు కర్నూలు నుంచి బస్సు బయలుదేరుతుందని, క్షేత్రాల దర్శనం అనంతరం 13న సాయంత్రం 6గంటలకు తిరిగి కర్నూలుకు చేరుకుంటుందని, 2+2 పుష్ బ్యాక్ సీట్ల ఈ సూపర్ లగ్జరీ బస్సులు యాత్రకు రానుపోను చార్జీ రూ.4వేలు ఉంటుందని, ఇందులో ముందస్తుగా టికెట్లు పొందే వీలు కల్పించినట్లు వెల్లడించారు. వివరాలకు ఫోన్ 77027 74358 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

వేడుకగా గ్రామోత్సవం



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న దృశ్యం



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఆదోని సెంట్రల్ : పట్టణంలో తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవారి సేవకుల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీనివాస కల్యాణం ఘనంగా నిర్వహించారు. కమిటీ సభ్యులు భీమిరెడ్డి, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణసింగ్, జి.సత్యనారాయణ, నామాల చిన్న నరసప్ప, చిన్న బసప్ప, విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షుడు బసవన్నగౌడ్ ఆధ్వర్యంలో వేడుక జరిపించారు. మంగళ ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి వేంకటేశ్వర స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పట్టణంలో చేపట్టి గ్రామోత్సం వేడుకగా జరిగింది. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి విరాళం



దాత గోవింద రెడ్డి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

ఆలూరు: ఆలూరు ఉపాధ్యాయ నగర్ కాలనీలో కొలువుదీరిన సాయిబాబా మందిరం అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని హాలహర్వి మండలం కొక్కెరచేడుకు చెందిన గోవిందారెడ్డి, ఆయన సతీమణి సరస్వతమ్మ తెలిపారు. స్థానిక ఆలయంలో ఆదివారం ఆలయ నిర్వహణ ఖర్చులకుగాను రూ.25 వేలు, గ్రామానికి సమీపంలో 54 అడుగుల ఎత్తుతో నిర్మిస్తున్న బెళ్లగుండ ఆంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటుకు రూ.50,116 లను ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ కమిటీ సభ్యులు శ్రీనివాసరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, నాగేంద్రయ్యశెట్టి, తదితరులు ఘనంగా సన్మానించారు.